సాక్షి
పెద్దపల్లి
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



పెద్దపల్లిలో విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న మసీద్

నేడు రంజాన్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు సిద్ధం అయ్యారు. శుక్రవారం నెలవంక దర్శనం ఇవ్వడంతో పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా జిల్లాలోని మసీదులు విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి. ఈద్గాలు ప్రత్యేక ప్రార్థనలకు రెడీ అయ్యాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

గరిష్టం/కనిష్టం
38.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొద్దంతా ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో గాలివాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసీఆర్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అరాచకపు పాలనపై ప్రజలంతా అసంతృప్తితో ఉన్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మూడు రోజుల పాటు సీఎల్పీ నేత భట్టివిక్రమార్క సారథ్యంలో సాగిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర విశేషాలను శుక్రవారం వెల్లడించారు. పాదయాత్ర సాగిన పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల ప్రజలు ఘనస్వాగతం పలికి, ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారని వివరించారు. ధరణి పోర్టల్‌తో అనేక సమస్యలు ఉన్నాయని పలువురు సీఎల్పీ నేత దృష్టికి తెచ్చారన్నారు. మానేరు ఇసుకను అక్రమంగా అమ్ముకున్నారని, మున్సిపాలిటీల్లో విచ్చలవిడిగా అవినీతి సాగుతోందని పేర్కొన్నారని తెలిపారు. నియోజకవర్గంలో భట్టి పాదయాత్ర విజయవంతానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నూగిల్ల మల్లయ్య, సంపత్, ప్రకాశ్‌రావు, సారయ్యగౌడ్, మహేందర్, వీరేశం,మస్రత్, సతీశ్, సంతోష్, రాజు, శ్రీమాన్ ఉన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం పోటీలో ఉన్నా



మాట్లాడుతున్న గంట రాములు

పెద్దపల్లిరూరల్: ఇరవైఏళ్ల కాలంగా ప్రజాసేవలోనే ఉన్న.. గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై, ఎంపీపీ, జెడ్పీటీసీగా ఎదిగా... బీసీ వర్గానికి చెందిన తాను అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం పోటీపడుతున్నానని ఓదెల జెడ్పీటీసీ గంట రాములు అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ కోసం పోటీపడుతున్నానని రాములు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు ఈ నియోజకవర్గం తమదే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్నారు. టికెట్ అడిగినందుకు తన అనుచరులపై భౌతికదాడులకు దిగడమే కాకుండా కాంగ్రెస్ అగ్రనేతల ఫొటోలున్న ఫ్లెక్సీలను చించి వేశారని ఆరోపించారు. ఈ విషయమై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. రేగుల తిరుపతి, రవి, నాగరాజు, ఐలయ్య, శ్రీనివాస్, అనిల్, రఘు, శ్రీధర్, రాజు, సాయి, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభ్యున్నతి



ఇఫ్తార్ విందులో మక్కాన్‌సింగ్‌ఠాకూర్

రామగుండం: కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని, ముస్లింలకు రిజర్వేషన్ కల్పించిన కాంగ్రెస్‌ను ముస్లింలు ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని జమా మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్, మహంకాళి స్వామి, ఇసంపెల్లి అంజులు, అప్పాసి శ్రీనివాస్, యుగేందర్, ఎండీ.గౌస్‌బాబా, ఆశ్రఫ్‌ఖాన్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, సిరిశెట్టి సతీష్, నాగరాజు, యూసుఫ్ పాల్గొన్నారు.

పేస్కేలు వర్తింపజేయండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఉపాధిహామీ పథకం అమలులో కీలకంగా పనిచేస్తున్న తమకు పేస్కేలు వర్తింప జేయాలని కోరుతూ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌లకు వినతిపత్రం అందించినట్లు ఉపాధిహామీ ఉద్యోగుల ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ బొంగాని వెంకటేశం తెలిపారు. ఈ విషయం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వారివెంట నాయకులు శారద, శోభ, జగదీశ్, మేనేజర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

అంతులేని ఆవేదన!

- జిల్లాకేంద్రంలో అందని డయాలసిస్ సేవలు
- జిల్లా రోగులకు గోదావరిఖని, కరీంనగర్‌లో చికిత్స
- అందుబాటులో ఐదుబెడ్లు.. పెరుగుతున్న బాధితులు
- పెద్దపల్లిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభించాలి
- జిల్లాలోని బాధితుల వేదన



ఈ చిత్రంలో అధ్వానంగా కనిపిస్తున్న డయాలసిస్ కేంద్రం పెద్దపల్లి జిల్లాకేంద్రంలోనిది. జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు మొదట్లో ఓ ఎన్‌జీవో సంస్థ ఐదు యంత్రాలు అందించింది. వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా, ఏళ్లపాటు పక్కనపెట్టి వెనక్కి పంపించారు. తరువాత ప్రభుత్వమే ఐదు పడకలు, డయాలసిస్ యంత్రాలు అందించింది. రెండేళ్లుగా కేంద్రానికి స్టాఫ్ రిక్రూట్‌మెంట్, బడ్జెట్ అలాట్‌మెంట్ చేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోవటం లేదు. యంత్రాలు, బెడ్లు దుమ్ము పట్టిపోతున్నాయి. ఫలితంగా పెద్దపల్లివాసులు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరిఖని, కరీంనగర్ వెళ్లి చికిత్స తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సాక్షి, పెద్దపల్లి: మూత్రపిండాల వైఫల్య బాధితులకు సాంత్వన కలిగించాల్సిన కేంద్రాలు జిల్లాలో సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యకు పడకలు సరిపోక సమస్య ఏర్పడుతోంది. జిల్లాకేంద్రంగా ఏర్పడి ఏళ్లకేళ్లు గడుస్తుండగా.. కేంద్రం ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు.. ప్రభుత్వం ముందుకు వచ్చినా.. అధికారుల నిర్లక్ష్యం వ్యాధిగ్రస్తులకు శాపంగా మారింది. జిల్లాకేంద్రంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభించకపోగా.. గోదావరిఖనిలో ఉన్న ఐదు పడకలతోనే రోగులకు సేవలందిస్తున్నారు. మిగిలినవారు డయాలసిస్ చేయించుకునేందుకు కరీంనగర్ వెళ్లాల్సిన పరిస్థితి.

గోదావరిఖనిలో 46మంది రిజిస్ట్రేషన్

- జిల్లాలో మూత్రపిండాలు పాడైన బాధితుల్లో అన్ని వయస్సుల వారు ఉన్నారు. మధుమేహం, రక్తపోటు కారణంగా 30శాతం మందికి సమస్యలు తలెత్తుతున్నాయి. రాళ్లు ఏర్పడటం, ఇన్‌ఫెక్షన్లతో వచ్చే జబ్బులు 20శాతం వరకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి.
- గోదావరిఖనిలో 46 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరుకాకుండా కరీంనగర్, వరంగల్ వెళ్లేవారు అధికం. జిల్లాకేంద్రంలో డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లారోగులకు గోదావరిఖనిలోని ఐదు పడకలతోనే సరిపెడుతున్నారు. యంత్రాలు సరిపడా లేక రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.
- నిత్యం పదుల సంఖ్యలో రోగులు వస్తుండటంతో వరుసక్రమంలో వివరాలు నమోదు చేసుకోవడానికి ఆపసోపాలు తప్పటం లేదు. రెండు, మూడు రోజులకోసారి ఆసుపత్రికి వచ్చి డయాలసిస్ చేసుకుంటున్న బాధితులదీ అంతులేని వేదనే.
- జిల్లా కేంద్రంలో సెంటర్ పనులు పూర్తి చేసుకుని రోజులు గడుస్తున్నా.. ప్రారంభించకపోవటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.
- డయాలసిస్ పేషెంట్లు ఎక్కువసేపు నిలబడడం, ప్రయాణించడం కష్టం. ఇటువంటి పరిస్థితిలో చికిత్స కోసం దూర ప్రాంతాలకు బస్సులు, రైలులో నిలబడి పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.
- వీరికి తోడుగా కుటుంబసభ్యులలో ఎవరో ఒకరు ఉండాల్సిందే. రాను పోనూ ప్రయాణఖర్చులు భారంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభిస్తే బాధలు తప్పుతాయని అంటున్నారు.
- ఇదే విషయమై డీసీహెచ్‌వో శ్రీధర్‌ను వివరణ కోరగా రిక్రూట్‌మెంట్ పూర్తిచేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

ఇంత దూరం రాలేకపోతున్నా



మా ఊరు పెద్దపల్లి సమీపంలోని చందపల్లి. వ్యవసాయం చేసుకుని బతికే నాకు 10నెలల క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. ముందుగా హైదరాబాద్‌లో డయాలసిస్ చేయించుకున్న. ఊరికి దగ్గరగా ఉంటుందని 7నెలలుగా గోదావరిఖని ప్రభుత్వ డయాలసిస్ కేంద్రంలో చేపించుకుంటున్న. వారంలో మూడుసార్లు డయాలసిస్ చేయాల్సిఉంటుంది. నాకు చేతనైతలేదని పొలాన్ని కౌలుకు ఇచ్చిన. పెద్దపల్లిలో డయాలసిస్ ప్రారంభిస్తారని చెబుతున్నారు. ప్రారంభం కావడం లేదు. పెద్దపల్లిలో ప్రారంభమైతే.. మా ఊరికి కేవలం 2కిలో మీటర్ల దూరం ఉంటుంది. బాధలు లేకుండా తక్కువ దూరంలో డయాలసిస్ చేయనుకోవచ్చని ఎదురుచూస్తున్న.

– ఎక్కంటి సుబ్బారెడ్డి, డయాలసిస్ పేషెంట్

తాతతో నేనూ రావాల్సిందే



మాది రామగిరి మండలం కల్వచర్ల. మా తాత రాజయ్యకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఐదేళ్లుగా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో తాతకు డయాలసిస్ చేయించేందుకు తీసుకొస్తున్నాం. మా ఊరి నుంచి ఇక్కడికి రావడానికి దూరంగా ఉంది. పెద్దపల్లిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తే, ప్రయాణం బాధలు తగ్గుతాయి. బస్సులు కూడా రెగ్యులర్‌గా నడుస్తాయి. డయాలసిస్ చేయించడానికి నాలుగు గంటలపాటు సమయం పడుతోంది.

– ఎం.కౌశిక్, కల్వచర్ల, బాధితుడి సహాయకుడు

తడిసిన ధాన్యం.. రాలిన మామిడి



జూలపల్లిలో మొక్కజొన్నపంటను పరిశీలిస్తున్న అధికారులు

- అర్ధరాత్రి గాలివాన బీభత్సం
- జిల్లాలో పంటలకు తీవ్రనష్టం
- పరిశీలించిన అధికారులు



ధర్మారం: మామిడిని పరిశీలిస్తున్న అధికారులు



పెద్దపల్లిలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి

మంథని/ధర్మారం/జూలపల్లి: జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ఎండలు దంచికొట్టగా.. రాత్రి 11 నుంచి శుక్రవారం వేకువజామున వరకు గాలివాన భయాందోళనకు గురిచేసింది. ముఖ్యంగా మామిడి రైతులకు తీవ్రనష్టం వాటిల్లగా.. కోతకువచ్చిన వరిపంట నేలకొరిగింది. అక్కడక్కడ కోసిన ధాన్యం తడిసిపోయింది. మొక్కజొన్నకు తీవ్రనష్టం వాటిల్లింది. మంథని ప్రాంతంలో నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తుండగా.. వరణుడి ప్రతాపం అన్నదాతను భయపెడుతోంది. ధర్మారం మండలంలోని కటికెనపల్లి, బొమ్మారెడ్డిపల్లి, బంజేరుపల్లిలో మామిడితోటలకు నష్టం జరిగింది. బొట్లవనపర్తి కొత్తూరు, తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి పంటనష్టాన్ని పరిశీలించారు. జూలపల్లి మండలంలో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. ఆరుగ్రామాల్లో 375మంది రైతులకు చెందిన 627ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు పంటలు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

సీఈఐఆర్‌పై అవగాహన కల్పించాలి

- మొబైల్ పోతే ఫిర్యాదు చేయాలి
- సీపీ రెమా రాజేశ్వరి
- పోలీసు సిబ్బందికి జూమ్ ద్వారా శిక్షణ



సీపీ రెమారాజేశ్వరి

గోదావరిఖని: చోరీకి గురైన సెల్‌ఫోన్ రికవరీపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. శుక్రవారం రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, అధికారులకు సీఈఐఆర్ అప్లికేషన్‌పై జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సీపీ మాట్లాడుతూ ఫోన్ దొంగలించబడినా, పోయినా వెతికిపెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలురకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తోందని వివరించారు. కొత్తగా ప్రవేశ పెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా, వెతికి పట్టుకోవడానికి ఈ అప్లికేషన్ ఎంతగానో చేయూతనిస్తుందని అన్నారు. ఫోన్ పోతే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సెకండ్ హాండ్ ఫోన్లు కొనే ముందు అప్లికేషన్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబరు నమోదు చేసి ఉందో చెక్ చేసుకోవాలని, తద్వారా ఆ ఫోన్ ఆ ఫోన్ స్టేటస్ తెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూముల హామీ ఏమైంది..?

- ఇక్కడి పచ్చదనానికి కారణం ఎస్సారెస్పీ కాలువలే..
- ఇసుక మాఫియాతో రోడ్లు ధ్వంసమైనా పట్టదా?
- పోలీసులు ఇసుక మాఫియా కోసం పని చేస్తున్నారు
- ప్రజా సమస్యలపై ధర్నాలు చేస్తే అరెస్టులా..?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూముల హామీ ఏమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఆయన జమ్మికుంట మండలంలోని నాగంపేట నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాను నియోజకవర్గంలో ప్రవేశించిన సమయంలో మహిళలంతా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వస్తాయని ఆశించామని.. అవేమీ సాకారం కాలేదని వాపోయారన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 90 వేల ఎకరాల భూమి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాలువల కిందే సాగవుతోందని.. కాళేశ్వరం లేదా మరే ఇతర ప్రాజెక్టు కింద ఇక్కడ అదనంగా ఒక్క ఎకరం కూడా సాగు కాలేదని పేర్కొన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు అవకాశమిస్తే.. 10 ఏళ్ల దాటినా 90 వేల ఎకరాలకు మించి ఎకరానికి కూడా అదనంగా నీళ్లివ్వలేదని అన్నారు.

ఇసుక మాఫియాతో ఇక్కట్లు

స్థానికంగా మానేరు నది మీద ఇసుక మాఫియా చెలరేగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామర్థ్యానికి మించిన లారీలు జమ్మికుంట, హన్మకొండ మార్గంలో రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. రోడ్డు పక్కన జనావాసాలు లారీలతో వచ్చే దుమ్ముతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, వారి పరిస్థితిని బాధితులు స్వయంగా ఇళ్లలోకి పిలిచి చూపించారని అన్నారు. ఇసుక లారీలకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తే.. పోలీసులు అరెస్టు చేయడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే పోలీసులను కేవలం పరిపాలన కోసం తప్ప పక్షపాతానికి వినియోగించమని స్పష్టం చేశారు.

ఇంటికి రాలేదంటూ కాంగ్రెస్ నాయకుని ఆవేదన

30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న, ఎన్ని పార్టీల వాళ్లు ప్రలోభాలు పెట్టినా ఒక్క పైసా ఎవరి దగ్గర తీసుకోలేదని గంగ్రపల్లికి చెందిన మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు పరశురాం ఆవేదన వ్యక్తం చేశాడు. నిన్నమొన్న పార్టీలోకి వచ్చిన వారి ఇంటికి వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఈ బాధ తాను భరించలేనని, పురుగుల మందు తాగుతానని.. పార్టీకి రాజీ నామా చేస్తానని కన్నీరు పెట్టుకున్నాడు. దీంతో బ ల్మూరి వెంకట్, నాయకులు ఇంటికి వచ్చి బుజ్జగించారు.

పలకరిస్తూ.. ముందుకు సాగుతూ..

జమ్మికుంట మండలంలోని గుంపుల క్రాస్ రోడ్డు నుంచి భట్టి పీపుల్‌మార్చ్ పాదయాత్ర ప్రజలతో మమేకమై ముందుకు సాగింది. తనుగుల, గంగ్రపల్లి గ్రామాల వద్ద మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. నాగంపేట గ్రామం దాటిన తర్వాత భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం పాతయాత్ర కొనసాగిస్తూ శాయంపేట, ధర్మారం, కొత్తపల్లికి చేరుకున్నారు. కొత్తపల్లిలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అనంతరం మడిపల్లి గ్రామ సమీపంలోని శాంతినగర్ కాలనీ వద్ద బస చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, సదానందం, పరుశరాం, నియోజవర్గ మైనార్టీ చైర్మన్ ఎండీ సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

గుడారాల వద్దనే బుక్కెడు బువ్వ



శిబిరం వద్ద భోజనాలు చేస్తున్న నాయకులు

జ్యోతినగర్: గూడు కోసం గుడారాల వద్దనే నిరుపేదలు బుక్కెడు బువ్వను తిని నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు భూపోరాట శిబిరాల వద్ద పేద ప్రజలు తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గుడారాల వద్ద ఎర్రటి ఎండలో భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. రెండో డివిజన్ కార్యదర్శి లక్ష్మారెడ్డి, ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే సీపీఎం పార్టీ ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తుందని అన్నారు. భిక్షపతి, రవికుమార్, రమణ, దేవేంద్ర, ఉపేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ సేవలు భేష్



సీఐఎస్ఎఫ్ మాక్ డ్రిల్



బహుమతులు అందిస్తున్న ఈడీ సునిల్‌కుమార్

- ఎన్టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో సీఐఎస్‌ఎఫ్ సేవలు భేష్ అని ఎన్టీపీసీ రామగుండం– తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్లాంటులోని ఫైర్‌వింగ్ భవనంలో జరిగిన జాతీయ అగ్ని మాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు, తెలంగాణ ప్రాజెక్టు, సోలార్ ప్లాంటును సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అనుక్షణం రక్షిస్తున్నారన్నారు. సంస్థకు చెందిన ముడిసరుకు బొగ్గుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ రెండూ కూడా మండే స్వభావం కలిగేవి కాబట్టి వాటిని అనునిత్యం కాపాడుతూ ప్రమాదాలు జరుగకుండా నివారించడం చాలా గొప్ప విషయమన్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులను అందించారు. సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం నిర్వహించిన మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. సీనియర్ కమాండెంట్ ముఖేష్‌కుమార్, సీజీఎం ప్రజేంజిత్ పాల్, జనరల్ మేనేజర్లు అతుల్ కమలాకర్ దేశాయ్, డెప్యూటీ కమాండెంట్ గుప్త, అసిస్టెంట్ కమాండెంట్ భాస్కరన్, ఇన్స్‌పెక్టర్లు రాజ్‌కుమార్, ఆర్ఎస్ యాదవ్, ఘోష్ పాల్గొన్నారు.

మానకొండూరులో తుపాకీ పేలలేదా?

- నిందితుల చేతులపై జీఎస్ఆర్ లేదంటున్న పోలీసులు
- అంతా పబ్లిసిటీ స్టంట్ అని కొట్టిపారేసిన ఖాకీలు
- ఇంకా ఆచూకీ చిక్కని నిందితుడు సాయితేజ



నిందితుడు సాయి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానకొండూరు కాల్పుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో అసలు కాల్పులు జరిగాయా? లేదా అన్న విషయంలో మొదటి నుంచి అనుమానాస్పదంగానే ఉంది. ఘటనాస్థలంలో బుల్లెట్ దొరకడం, బాధితుడు తనపై రెండుసార్లు ఫైర్ చేశారని మీడియా ముందు చెప్పడంతో కాల్పులు జరిగాయని అంతా అనుకున్నారు. దీంతో ఈ విషయాన్ని పోలీసులు శాస్త్రీయంగా నిర్ధారించుకున్నారని సమాచారం. సాధారణంగా తుపాకీ పేల్చిన తరువాత కొన్ని గంటలపాటు అలాగే ఉంటుంది. ఈ నేపథ్యంలో తుపాకీ ఎవరు పట్టుకున్నారు అన్న విషయంలో పోలీసులకు స్పష్టత ఉంది. కానీ, మీడియాలో తుపాకీ కాల్పులు అని నిందితుడు భాషబోయిన అరుణ్ పదేపదే చెబుతుండే సరికి, తమ కస్టడీలో ఉన్న ముగ్గురిని పరీక్షిస్తే.. వారి చేతులపై ఎలాంటి జీఎస్ఆర్ (గన్‌షాట్ రెసెడ్యూ) ఆనవాళ్లు లభించలేదని ఓ ఉన్నతాధికారి స్పష్టంచేశారు. అదే విధంగా ఘటనాస్థలంలో కూడా కాల్పులు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. గోడలకు తూటాల దెబ్బలు, నేలపైనా ఎలాంటి కెట్రిడ్జ్ (బుల్లెట్ కాల్చాక కిందపడే భాగం) అవశేషాలు లభించలేదని, కేవలం పేలని ఒక రౌండ్ బుల్లెట్ మాత్రమే లభించిందని వివరించారు.

- పాత నేరస్థుడైన అరుణ్ కేవలం తన పబ్లిసిటీ స్టంట్‌లో భాగంగానే.. సానుభూతి కలిగేలా ఉన్నవి, లేనివి కల్పించి చెబుతున్నాడని అభిప్రాయపడ్డారు. అతనికి గోదావరిఖని సాయితేజతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని కొట్టిపడేశారు. ఇద్దరు మూడేళ్ల క్రితం వరకు మంచి స్నేహితులు అని పేర్కొన్నారు. మరోవైపు సాయితేజ కోసం హైదరాబాద్ వెళ్లిన ప్రత్యేక బృందానికి కొత్త విషయాలు తెలిశాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీటెక్ వరకు చదువుకున్న సాయితేజ కొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డాడని, అదే సమయంలో సోదరి ఆకస్మిక మరణం అతన్ని కుంగదీసిందని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే.. పదే పదే గొడవల్లో ఇరుక్కుని కుటుంబానికి తలనొప్పిగా మారిన కారణంగా సాయితేజకు తామంతా చాలాకాలంగా దూరంగా ఉంటున్నామని వివరించారు. ఈ సమాధానాలతో పోలీసులు నిరాశ చెందారు. నిందితుడు సాయి తన కుటుంబ సభ్యులను కచ్చితంగా సంప్రదించేందుకు వస్తే.. పట్టుకోవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

మిత్రుడి కారు.. ఫోన్ స్విచ్ఛాఫ్..

అరుణ్‌పై హత్యాయత్నానికి సాయితేజ గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన అతని స్నేహితుడు స్విఫ్ట్ డిజైర్ కారు తీసుకెళ్లాడని పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం మానకొండూరు నుంచి సాయి హైదరాబాద్ మార్గంలోనే పారిపోయాడని పోలీసుల వద్ద సమాచారం ఉంది. కానీ.. హత్యాయత్నం తరువాత సాయి అనూహ్యంగా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అతన్ని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. సాయికి గంజాయి వ్యాపారులతో సంబంధాలున్న నేపథ్యంలో అతను ఎక్కడ తలదాచుకున్నాడన్నది పోలీసులకు అంతుచిక్కడం లేదు. వీలైనంత త్వరగా పట్టుకుంటామని పోలీసులు మాత్రం ధీమాగా ఉన్నారు.

క్లుప్తంగా

చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం

మంథని: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహం శుక్రవారం ధ్వంసమైంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన రాజయ్య అనే వ్యక్తి రాడ్‌తో విగ్రహంపై దాడిచేశాడు. దీంతో ఐలమ్మ విగ్రహం మొహం, ముక్కు, కండ్లు దెబ్బతిన్నాయి. రాజయ్య చేతిలో రాడ్లు, కత్తులు ఉండడంతో స్థానికులు వారించలేకపోయారు. కొంతకాలంగా రాజయ్య కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడని, ఇటీవల బొక్కలవాగు సమీపంలోని సఫాయి కర్మచారుల విగ్రహాన్ని సైతం చెత్తపోసి కాలపెట్టాడని స్థానికులు తెలిపారు. ఐలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

వీర బ్రహ్మేంద్రస్వామి మహోత్సవాలు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శ్రీ కాశీ శివ లింగ సహిత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి 30 ఆదివారం వరకు స్వామివారి వైభవోత్సవాల్లో భాగంగా ప్రతీరోజు అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, వేదమంత్ర పఠనం, అఖండ భజనా–సప్తాహం, హోమాలు, తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కన్వీనర్ మామిడిపల్లి శ్రీధర్, కో కన్వీనర్ కట్కోజుల సదానందం, కోశాధికారి సుధాకర్ తెలిపారు.

28లోగా దరఖాస్తులివ్వండి

పెద్దపల్లిరూరల్: జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న డిస్ట్రిక్ట్ డయోగ్నోస్టిక్ హబ్‌లో ఖాళీగా ఉన్న ఆరు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు వీలుగా ఈ నెల 28లోగా దరఖాస్తులు సమర్పించాలని డీసీహెచ్ఎస్ శ్రీధర్ తెలిపారు. ఎండీ పాథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, పురుష రేడియోగ్రాఫర్ రేడియాలజీ ల్యాబ్‌మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో అందించాలని సూచించారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన చిప్ప కనకలక్ష్మి(45) మహిళ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకలక్ష్మి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి భర్త బానయ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై రవి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమీకృత మార్కెట్లపై నిర్లక్ష్యం

- గోదావరిఖనిలో రెండుచోట్ల ఏర్పాటుకు సర్కారు నిర్ణయం
- విఠల్ నగర్‌లో నిలిచిన పనులు
- ఎన్టీఆర్ నగర్‌లో వారం క్రితమే మళ్లీ ప్రారంభం
- రామగుండం బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు


గోదావరిఖని విఠల్ నగర్‌లో మార్కెట్ పరిస్థితి


పిల్లర్ల దశలో ఎన్టీఆర్ నగర్‌లోని మార్కెట్ కాంప్లెక్స్

కోల్‌సిటీ(రామగుండం): పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా వివిధ ప్రాంతాల్లో హోల్‌సేల్, రిటైల్ కూరగాయలు, చేపలు, మాంసం, పూలు తదితరాల విక్రయానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్(సమీకృత మార్కెట్లు)లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం రామగుండం నగరపాలక సంస్థలో నీరుగారిపోతోంది. నగరపాలక సంస్థలోని వీధి వ్యాపారులు, ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న రెండు కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం గోదావరిఖనిలో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు కావడం లేదంటూ కాంట్రాక్టరే నిలిపివేసినట్లు తెలిసింది. గతేడాది ఎన్టీఆర్ నగర్‌లో ప్రారంభించిన మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ పనులు కూడా ఊపందుకోలేదు. ఇతర నగరాల్లో ప్రారంభించినవి చివరిదశకు చేరుకున్నాయి. రామగుండం బల్దియా పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

విఠల్ నగర్‌లో మూడేళ్ల క్రితం ప్రారంభం..

గోదావరిఖని విఠల్‌నగర్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం సీఎం గ్రాంట్స్ నిధులు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ.కోటి బల్దియా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ స్లాబులు, గోడలను నిర్మించి, మధ్యలోనే ఆపేశారు. మిగతా పనులు పునాదులకే పరిమితమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు అంటున్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో ఏడాది క్రితం..

గోదావరిఖని ఎన్టీఆర్ నగర్‌లో మరో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రస్తుతం పాలకవర్గం ముందుకు వచ్చింది. ఇందుకోసం రూ.4.5 కోట్ల పట్టణ ప్రగతి నిధులు కేటాయించారు. గతేడాది జూన్‌లో నగర మేయర్, డివిజన్ కార్పొరేటర్‌తో కలిసి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శంకుస్థాపన చేశారు. కానీ పనులు ఇప్పటికీ పిల్లర్ల దశలోనే ఉన్నాయి. వారం క్రితమే పనులు తిరిగి మొదలయ్యాయి. మార్కెట్ కాంప్లెక్స్‌లో మొత్తం 98 గదులు నిర్మిస్తున్నారు. వెజ్ బ్లాక్‌లో 18 రూములను పండ్లు, పూల దుకాణాలకు, 52 రూములను కూరగాయల దుకాణాలకు, నాన్‌వెజ్ బ్లాక్‌లో 28 రూములను మేకలు, కోళ్ల మాంసం, చేపల విక్రయించడానికి కేటాయించారు.

చిరు వ్యాపారుల ఇబ్బందులు

నగరంలోని చాలా మంది చిరు వ్యాపారులకు సరైన చోటు దొరక్క రోడ్లపైనే విక్రయాలు చేపడుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు పూర్తయితే వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



విఠల్‌నగర్‌లో చేపడుతున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వీడి, వెంటనే పూర్తి చేయాలి. ఏళ్లుగా వదిలేయడం సిగ్గుచేటు. అర్ధంతరంగా పనులు నిలిచిపోయిన మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కలెక్టర్ స్పందించి, చర్యలు తీసుకోవాలి.

– మద్దెల దినేశ్, సీపీఐ నగర కార్యదర్శి

ప్రభుత్వానికి నివేదించాం



నగరంలో రెండుచోట్ల సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నాం. పనుల పురోగతిపై ప్రభుత్వానికి నివేదించాం. విఠల్‌నగర్‌లో బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఎన్టీఆర్ నగర్‌లో మార్కెట్ పనులు జరుగుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్

లారీని ఢీకొన్న కారు

- ఒకరు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


నవీన్ మృతదేహం

పాలకుర్తి: మండలపరిధిలోని పుట్నూర్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి నిలిచిఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో కల్లెపల్లి నవీన్ (35) వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు కల్లెపెల్లి వినోద్, సుద్దాల అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన నవీన్, వినోద్, అజయ్‌లు పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మీసేవా కేంద్రం నిర్వహించడంతో పాటు డ్యాక్యుమెంటర్ రైటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వారు సొంత పని మీద పుట్నూర్‌కు వెళ్లి కారులో తిరిగివస్తుండగా మార్గమధ్యంలో పుట్నూర్ గ్రామశివారులో ఆగిఉన్న టిప్పర్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టారు. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ముందు సీట్లో కూర్చున్న నవీన్ అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్ వినోద్‌తో పాటు అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో రహదారికి ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానికులు అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రుల్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి


ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ గిరిప్రసాద్

- గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్

గోదావరిఖని: నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా నగర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ, భద్రత భావం కల్పించేందుకు పోలీసులు అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీసులకు లేదా 100కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వివరాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, టూటౌన్ సీఐలు వేణుగోపాల్, అఫ్జలుద్దీన్, ఎస్సైలు, కానిస్టేబుల్స్, డిస్ట్రిక్ గార్డులు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోండి



జిల్లా ఆసుపత్రిలో నిరసనవ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రధానాసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న టీ–డయోగ్నోస్టిక్ సెంటర్‌లో ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి డిమాండ్ చేశారు. గత నెల 14న ఆరు ఉద్యోగాల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చి 25న ఇంటర్వ్యూలు నిర్వహించాని తెలిపారు. డబ్బులు తీసుకుని అనర్హులను ఎంపిక చేశారని, కలెక్టర్ దృష్టికి రావడంతో వాటిని రద్దు చేశారని వివరించారు. అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. నాయకులు దిలీప్, రవీందర్, శ్రీకాంత్, చరణ్, బబ్బి, నవీన్, ప్రశాంత్, శ్రావణ్, మణి, అభిషేక్ సన్నీ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

- ఒక్కో టిప్పరుకు రూ.10వేలు జరిమానా


తహసీల్దార్ కార్యాలయంలో పట్టుబడిన టిప్పర్లు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గట్టెపల్లి గ్రామశివారులోని ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను గురువారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ భూమి నుంచి ఓ కాంట్రాక్టర్ ఏలాంటి అనుమతులు లేకుండా సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తుండగా స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో మూడు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం తహసీల్దార్ యాకన్న ఒక్కో టిప్పరుకు రూ.10వేల జరిమానా విధించి వదిలేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అస్థికలు కలిపేందుకు వచ్చి..


లారీని ఢీకొన్న మినీ ట్రావెల్స్ బస్సు


ప్రమాదంలో గాయపడినవారు


ప్రమాదానికి కారణమైన చెట్టుకొమ్మ

- రోడ్డు ప్రమాదానికి గురై..
- కొత్తపేట వద్ద ప్రైవేట్ బస్సు, లారీ ఢీ
- తీవ్రంగా గాయపడి బస్సు డ్రైవర్ మృతి
- మరో 15మందికి గాయాలు
- పది మందికి స్వల్పంగా
- అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు
- చెట్టును తప్పించబోయి ఢీకొన్న వాహనాలు

వెల్గటూర్(ధర్మపురి): తన తల్లి అస్థికలను ధర్మపురి గోదావరి నదిలో కలిపేందుకు మినీ బస్సులో బయలు దేరిన మెదక్ జిల్లా గజ్వేల్ మండలం బేజ్‌గామ్ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్, తన 25మంది కుటుంబసభ్యులు కొత్తపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్ పగిల్ల మల్లయ్య(50) మృతి చెందగా మిగతా వారు తీవ్రగా గాయపడ్డారు. ఇందులో 15మంది కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆకుల దేవేందర్ తల్లి అనసూయ ఇటీవల చనిపోయింది. ఆమె అస్థికలను జిల్లాలోని ధర్మపురి గోదావరినదిలో కలిపేందుకు కుటుంబసభ్యులందరూ శుక్రవారం ఉదయం మినీ బస్సులో బయలుదేరారు. బస్సు ఎండపల్లి మండలం కొత్తపేట వద్దకు రాగానే వెల్గటూర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలలు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బూస్టర్ డోస్‌కు సిద్ధం


మాతాశిశు కేంద్రం


- జిల్లాకు ఎనిమిదివేల డోస్‌ల కార్బోవ్యాక్స్
- పీహెచ్‌సీలకు చేరవేసిన అధికారులు

ధర్మారం: రాష్ట్రంలో కరోనా కేసులు వెలుగుచూస్తుండడంతో ప్రభుత్వం ముందు జాగ్రత్తగా బూస్టర్‌డోస్‌లపై దృష్టి సారించింది. పెద్దపల్లి జిల్లాలో ఇటీవల దాదాపు వెయ్యి మందికి కరోనా పరీక్షలు చేయగా 20 మందికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం వారు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. జిల్లాలో కరోనా వ్యాక్సిన్ నిల్వలు లేకపోవడంతో రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం పంపించిన డోస్‌లను జిల్లాల వారీగా కేటాయించింది. ఈక్రమంలో పెద్దపల్లి జిల్లాకు ఎనిమిది వేల డోసులను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ డోస్‌లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఆధ్వర్యంలో జిల్లాలోని ఆస్పత్రి, ఏరియా ఆసుపత్రులు, యూహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు చేరవేశారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా అర్హులైన ప్రతి ఒక్కరూ మూడో డోస్ వేసుకోవాలని సూచిస్తున్నారు.

8వేల డోసులు సరఫరా

కరోనా విజృంభిస్తుండడంతో ఇప్పటికే రెండు డోస్‌లు టీకా తీసుకున్నవారు మూడో డోస్ తీసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు బూస్టర్ డోస్ తీసుకునేలా అవగాహన కల్పించేందుకు స్థానిక వైద్యుల ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది సిద్ధమవుతున్నారు. జిల్లాలో 12 నుంచి 14 ఏళ్ల వయస్సు వారికి మొదటి డోస్ వేస్తుండగా ఇప్పటికే జిల్లాలో 18 నుంచి వృద్ధుల వరకు మొదటి, రెండో డోస్ వందశాతం వేశారు. 18 ఏళ్లు నిండిన వారు మూడో డోస్ వేసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయినప్పటికీ 55 శాతం మూడో డోస్ పూర్తిచేయగలిగారు. ప్రస్తుతం కోవిడ్ కేసులు పెరుగుతున్న క్రమంలో ప్రభుత్వం టీకాల పంపిణీపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బూస్టర్‌డోస్‌ను నిర్లక్ష్యం చేయరాదు



మూడో డోస్‌ను ఎట్టి పరిస్థితిలో నిర్లక్ష్యం చేయొద్దు. రెండు డోసులు తీసుకున్న ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేసుకోవాలి. కోవీషిల్డు, కోవాగ్జిన్ ఏ వ్యాక్సిన్ తీసుకున్నా సరే కార్బోవ్యాక్స్ టీకా తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండి రెండు డోస్‌లు తీసుకున్న వారే బూస్టర్ డోస్‌కు అర్హులు. అర్హులు సెంటర్లకు వచ్చి టీకా వేయించుకోవాలి.


– డాక్టర్ కృపాబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, పెద్దపల్లి

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నియంత్రణ


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు, సిబ్బంది

పెద్దపల్లిరూరల్: షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచి వినియోగించుకోవాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని మేన్‌రోడ్‌లో శుక్రవారం షాపింగ్‌మాల్ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. గదుల్లో పొగ నిండినపుడు మెట్ల మార్గంలో వచ్చేవిధానంపై సూచనలిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, మనోహర్, రవి తదితరులున్నారు.

జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా నర్సయ్య


మద్దెల నర్సయ్య

ఓదెల: జాతీయ మాలమహానాడు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి మద్దెల నర్సయ్య ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా అప్పుల పోచయ్య, మద్దెల స్వామి(జూలపల్లి), ఉన్నింటి ప్రభాకర్(పెద్దపల్లి), కొడెం శ్రీనివాస్(ఓదెల), ప్రధానకార్యదర్శిగా చీదురు నరేందర్, మాలయువత జిల్లా అధ్యక్షుడిగా అచ్యుత్‌కుమార్ ఎన్నికయ్యారు. తన నియమాకానికి కృషిచేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దెంకి దయాకర్, రాష్ట్రఅధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు అసారి పురుషోత్తంకు జిల్లా అధ్యక్షుడు నర్సయ్య కృతజ్ఞతలు తెలిపారు.